క్లుప్తంగా

పురిటిపెంటలో వైద్య శిబిరం



శిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి పుష్పాంజలి

గజపతినగరం : మండలంలోని పురిటిపెంట వెల్‌నెస్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 77 మందికి వైద్య పరీక్షలు చేశారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పుష్పాంజలి రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్త, హెల్త్ అసిస్టెంట్ తదితరులు తమ సేవలు అందించారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తుమ్మికాపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తవలస : మండలంలోని కొత్తవలస – దేవరాపల్లి రోడ్డులో తుమ్మికాపల్లి గ్రామం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు బుధవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల అరకు నుంచి ఐచర్ వ్యాన్‌లో అక్రమంగా 450 కేజీల గంజాయి, అలాగే సబ్బవరం మండలం గుల్లేపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద 920 కేజీల గంజాయి పట్టుబడడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో ఈ రోడ్డులో వెళ్లే ప్రతీ వాహనంతో పాటూ, ఆర్‌టీసీ బస్సులను సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలకు సంబంధించి సీ బుక్‌లను, రోడ్డు పర్మిట్లను పరిశీలిస్తున్నారు.

మూగజీవాలకు వ్యాక్సిన్



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

వేపాడ: మండలంలోని చినగుడిపాల పంచాయతీలో 135 పశువులకు జడుపులు, కాళ్లు, నోటికి పుండ్లు రాకుండా నివారణకు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేసినట్టు వెటర్నరీ అసిస్టెంట్ చాణక్య తెలిపారు. వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగంగా చినగుడిపాల, బోజంగివానిపాలెం గ్రామాలకు చెందిన 135 పశువులకు బుధవారం ఈ వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. సర్పంచ్ బోజంకి రామునాయుడు, వార్డు సభ్యుడు బోజంకి మంగునాయుడు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఆరుద్ర

గుర్ల: అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న చిన్నారుల్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా కార్యకర్తలు తగిన చర్యలు తీసుకోవాలని సీడీపీఓ ఎన్.ఆరుద్ర సూచించారు. మండలంలోని కోటగండ్రేడు సెక్టార్ పరిధిలో గూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. వర్షాకాలంలో చిన్నారులకు వైరల్ జ్వరాల్లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉన్నందున చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. చిన్నారుల తల్లులతో మాట్లాడుతూ పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శకుంతల పాల్గొన్నారు.

గురుకులంలో నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కంటి వైద్యులు ఈశ్వరరావు నేతృత్వంలో నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణం తరువాత కళ్లు నశింపకూడదని, అంధుల చూపు కోసం కళ్లు దానం చేయాలని నేత్రదానం వెలకట్టలేనిదన్నారు. చనిపోయిన 6 నుంచి 8 గంటల మధ్య నేత్రాలు దానం చేయడం వల్ల ఇతరులకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ శారద, వేపాడ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఆంజనేయుడు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరుల పంట మొక్కజొన్న

- ఎకరాకు రూ.35వేలకు పైగా ఆదాయం
- ఆసక్తి చూపుతున్న రైతులు



సీతారామపురంలో మొక్కజొన్న సాగు

గజపతినగరం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో రైతులు నూతనంగా ఆలోచిస్తూ మొక్కజొన్న సాగుకు ముందుకు వస్తున్నారు. లేత దశలో తెగుళ్ల నివారణ చేపడుతూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరితో పాటు వివిధ రకాల పంటలు వేస్తుండగా కొన్ని గ్రామాల్లో ఏడాది పొడవునా మొక్కజొన్న పండిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. పశువులకు దాణాగా కూడా మొక్కజొన్న పనికి వస్తుందని రైతులు చెబుతున్నారు. అనేక పరిశ్రమల్లో ముడి సరుకుగానూ తినుబండారాలు, తీపి కండెలు, కాయగూరల రకంగానూ పేలాల రూపంలోనూ వినియోగించడంతో ఈ పంటకు గిరాకీ పెరిగింది. ఇన్ని రకాలుగా మొక్కజొన్న ఉపయోగపడటంతో సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. మండలంలో 8,654 సాగు విస్తీర్ణ భూములు ఉండగా ఖరీఫ్‌లో 6323 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను 1200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. తక్కువగా పెట్టుబడితో తొందరగా దిగుబడులు వస్తుండడంతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎకరాకు రూ. 15 వేల నుంచి 20 వేల వరకు ఖర్చు కాగా రూ.25 వేల 35 వేల వరకు ఆదాయం వస్తుంది.

లేత దశల్లో తెగుళ్ల నివారణ

కిలో విత్తనానికి 3గ్రాముల మాంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని 30నుండి 35 రోజుల సమయంలో, 50నుండి 55 రోజుల వ్యవధిలో మరోసారి నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును సగం పొటాష్ ఎరువును పూత దశలో వేయాలి. నీటి పారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని 30రోజులు వ్యవధిలో, చివరగా 45నుండి 60రోజుల వ్యవధిలో నాలుగో వంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటలకొకసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉన్నట్టయితే లీటరు నీటిలో 2గ్రాములు జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే పైపాటు ఎరువులు వేయాలి.

కలుపు నివారణ

పంట విత్తిన తరువాత రెండు మూడు రోజుల్లోపు ఆట్రజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. దీనిని తేలిక నేలలో ఎకరాకు 800గ్రాములు, బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వెడల్పాటి గడ్డి జాతి కలుపు మొక్కలు దాదాపు ఒక నెల పాటు అదుపు చేయొచ్చు. మొక్కజొన్నలను పప్పుజాతి పంటల్లో అంతర పంటగా వేసేటప్పుడు పంటకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్ కలిపి నాటిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలను గమనిస్తే ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాములు 2, 4డీసోడియం సాల్ట్‌ను కలిపి పిచికారీ చేయాలి.



లింగాలవలస గ్రామంలో ఎండ బెడుతున్న మొక్కజొన్న కండెలు

మొక్కజొన్న సాగు చేస్తున్నా...



ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు అనుకూలంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండటంతో ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను వేస్తాను. ప్రతీ ఏడాది మొక్కజొన్న పంటతో లాభాలు బాగానే వస్తున్నాయి. గ్రామాల్లోని వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కె.సన్యాసప్పుడు, రైతు సీతారామపురం

లాభాలు బాగు



మొక్కజొన్న పంట సాగు ఎంతో సులువు. ఎకరాకు 20వేలు పెట్టుబడి పెడితే దాదాపు 30వేల వరకూ ఆదాయం లభిస్తుంది. ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు అనుకూలం. ప్రతీ ఏటా రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపడతాను. ఆర్బీకే నుండి సంబంధిత అధికారులు సలహాలు ఇస్తుంటారు

–లెంక బంగారయ్య, రైతు

మూడు నెలల్లో చేతికి పంట

విత్తు నాటిన మూడు మాసాల్లోనే పంట చేతికి వస్తుంది. మండలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో 1200 పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతుంది. రైతులు ఏటా ఆసక్తిని పెంచుకుంటన్నారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి ఇచ్చిన సలహాల మేర వ్యవసాయాన్ని చేసేందుకు ముందుకు వస్తున్నారు.

–మహారాజన్, ఏడీఏ, గజపతినగరం క్లస్టర్

శిథిలావస్థలో వ్యవసాయ శాఖ కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న మండల వ్యవసాయ శాఖ కార్యాలయం

చీపురుపల్లి: అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖల్లో వ్యవసాయశాఖ ఒకటి. అలాంటి శాఖ ప్రస్తుత ప్రభుత్వంలో కనీస ఆదరణ నోచుకోవడం లేదు. అందుకు మండల కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. మండల కేంద్రంలో నిరంతరం రైతులు, అధికారులతో కలకలాడాల్సిన వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని తుప్పలతో నిండిపోయి దర్శనమిస్తోంది. ఒకప్పుడు ఎంతో హడావుడిగా ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయం మూతపడి అటువైపు వెళ్లలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. దీంతో మండల వ్యవసాయశాఖాధికారి కూర్చునేందుకు కనీసం కుర్చీ లేని దుస్థితి నెలకొంది. ప్రతీ రోజూ మండలానికి వచ్చే వ్యవసాయాధికారి ఏ రైతుభరోసా కేంద్రంలోనో లేక వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలోనో కూర్చుని తరువాత క్షేత్ర సందర్శనకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండల వ్యవసాయాధికారి కార్యాలయం లేకపోవడంతో రైతులు సైతం మండల కేంద్రానికి వచ్చి ఎక్కడకు వెళ్లాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మండలంలో సాగు పంటలకు సంబంధించి సమాచారం అప్‌లోడ్ వంటి విషయాల్లో కార్యాలయం లేక ఇతర కార్యాలయాల్లో కూర్చుని వాటిని ఆన్‌లైన్ చేస్తుండడంతో వ్యవసాయ శాఖ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోనే ఉన్న మండల వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింది.

ఈ క్రాప్‌తో రైతులకు మేలు



సోమలింగాపురంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

మెరకముడిదాం: వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న రైతులు తమ పంటల వివరాలను ఈ క్రాప్ చేసుకోవడం వలన మేలు చేకూరుతుందని ఏఓ శ్రావణితేజ తెలిపారు. మండలంలోని సోమలింగాపురంలో ఈ క్రాప్ నమోదును ఆమె బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఆమె రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు కచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. దీని వలన భవిష్యత్‌లో రైతులు పండించే పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే ఈ క్రాప్ తప్పనిసరన్నారు. మండలంలో ఇంతవరకూ 2,860 ఎకరాల వరకూ ఈ క్రాప్ నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. మరికొద్ది రోజుల్లో అన్ని గ్రామాల్లో ప్రతీ పంటను ఈ క్రాప్ చేయనున్నామన్నారు.

వృథాగా డీసీఎంఎస్ స్థలం



పట్టణ నడిబొడ్డున కోట్లు విలువ చేసే డీసీఎంఎస్ స్థలం



శిథిలావస్థలో గొడౌన్లు

చీపురుపల్లి: కోట్ల రూపాయిల ప్రభుత్వ ఆస్తులంటే అందరికీ చులకనే.. అదే ప్రైవేటు స్థలం పట్టణ నడిబొడ్డున కాదు.. పట్టణ శివారున ఉన్నా దానికి రక్షణ ఉంటుంది. కానీ ప్రభుత్వ స్థలాలు అభివృద్ధికి నోచుకోకపోగా కనీసం రక్షణ కూడా లేని పరిస్థితులు ఉన్నాయి. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న డీసీఎంఎస్ స్థలం సుమారు 1.30 ఎకరాల్లో విస్తీర్ణంలో ఉంది. ఈ స్థలం విలువ ప్రస్తుతం అక్కడ మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకారం కనీసం రూ.10కోట్ల పైనే ఉంటుంది. అంతటి విలువైన స్థలం ఖాళీగా ఉండడమే కాకుండా కనీస రక్షణ కూడా లేకుండా పోయింది. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నాలుగైదు దశాబ్దాల కిందట ఇక్కడ కార్యకలాపాలు నిర్వహించారు. తరువాత కాలంలో ఇక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదు. దీంతో గొడౌన్లు, ఖాళీ స్థలం అలానే ఉండిపోయింది. పట్టణ నడిబొడ్డున అత్యంత విలువైన ఈ స్థలాన్ని వృథాగా ఇలా ఉంచేయకుండా వ్యాపార పరంగా అభివృద్ధి చేస్తే ఆ సంస్థకు మరింత ఆదాయం లభించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

నేడు గుడివాడలో గ్రామసందర్శన

వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామంలో గ్రామ సందర్శన గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బీఎస్ కూర్మనాథ్ పట్నాయిక్ బుధవారం తెలిపారు. నోడల్ అధికారి పీఎస్‌పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో నిర్వహించే ఈ సందర్శనలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు అంగన్‌వాడీ, పాఠశాలలను తనిఖీ చేయనున్నట్టు తెలిపారు.

పలుచోట్ల గ్రామసందర్శన

లక్కవరపుకోట/కొత్తవలస : లక్కవరపుకోట మండలం గేదెలవానిపాలెం, కొత్తవలస మండలం వియ్యంపేట గ్రామాల్లో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు కె.రూపేష్, పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు. అలాగే ఆయా గ్రామాల్లో వైద్య శిబిరం, పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

మెట్టపల్లిలో..

చీపురుపల్లి: మండలంలోని మెట్టపల్లి పంచాయతీలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ బిఆర్.అంబేడ్కర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 10 గంటలకు మెట్టపల్లిలో ప్రారంభమవ్వనున్న గ్రామసందర్శన కార్యక్రమాన్ని మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవ్వాలని తెలిపారు.

నేడు మధుపాడలో..

గంట్యాడ: మండలంలోని మధుపాడలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ భవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులంతా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు.

చింతలవలసలో..

దత్తిరాజేరు: మండలంలోని చింతలవలస గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు సకాలంలో హాజరు కావాలని చెప్పారు. గ్రామంలో గుర్తించిన సమస్యలును పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట : మండలంలోని ఎల్.కోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఖాసాపేట ఫీడర్ నిర్వహణ పనులను శుక్రవారం నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లైన్‌లో వైర్లపై గల చెట్టుకొమ్మలు తొలిగించడం, ఫీడర్ మరామ్మతులు నిర్వహించనున్నారు. దీంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఖాసాపేట, తలారి, కొట్యాడ, రంగరాయపురం, సంతపేట, కూర్మవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

గ్రామసభ నిర్వహించేదెప్పుడో..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని రేగటి పంచాయతీలో ఈ నెల 23న జరగాల్సిన గ్రామసభను నిర్వహించకపోవటంపై ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించినా నేటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆ పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ కె.రామకృష్ణ, మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు బుధవారం పేర్కొన్నారు. ఆ పంచాయతీలో మరోసారి గ్రామసభను నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని వారు కోరారు. ఈ నెల 23న గ్రామసభ జరుగుతుందని పంచాయతీ సెక్రటరీ పి.త్రినాధరావు దండోర వేయించారని తెలిపారు. గ్రామసభ సమయానికి గ్రామపెద్దలు, ప్రజలు హాజరైనప్పటికీ, గ్రామసభ నిర్వహించాల్సిన అధికారులు ఏ ఒక్కరూ హాజరు కాలేదని, దీంతో గ్రామసభ జరగలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రజల అభిప్రాయం దృష్ట్యా గ్రామసభను నిర్వహించాలని కోరారు.


పోలీస్ బీట్ పునఃప్రారంభం



ఎస్.కోట దేవీ జంక్షన్‌లో పోలీస్ బీట్ ప్రారంభించిన సీఐ మూర్తి

శృంగవరపుకోట : పట్టణ కేంద్రంలో స్థానిక దేవీ కూడలి వద్ద కొన్ని నెలలుగా మూతపడ్డ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ఎట్టకేలకు బుధవారం పునః ప్రారంభించారు. దుర్గాదేవి లైటింగ్ సప్లయర్స్ యూనియన్ వారి ఆర్థిక సహకారంతో పోలీస్‌బీట్‌కు మైక్‌సెట్ ఏర్పాటు చేయగా, స్థానిక వినాయక ఆలయ కమిటీ రంగులు వేయించి సిద్ధం చేశారు. పోలీస్‌బీట్‌ను సీఐ వి.ఎస్.మూర్తి ప్రారంభించారు. ప్రజలకు ఉపయోగపడేలా పోలీస్‌బీట్ సిద్ధం చేసేందుకు సహకరించిన స్థానికులకు సీఐ అభినంధనలు లెలిపారు. ఎస్.ఐ గంగరాజు తదితరులు హాజరయ్యారు.

ఊరటనిచ్చిన భారీ వర్షం



తుమ్మికాపల్లి గ్రామ సమీపంలో కురుస్తున్న వర్షం

కొత్తవలస/లక్కవరపుకోట : గడిచిన కొద్ది రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలకు అల్లాడిపోయిన ప్రజానీకానికి కొత్తవలస, లక్కవరపుకోట మండలాల పరిధిలో బుధవారం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సమీప గెడ్డల్లోను, చెరువుల్లోను నీటి ఇంజన్‌లు పెట్టి నీటిని తోడి దమ్ములను చేసారు. ఈ దమ్ములు వేసవిని తలపిస్తున్నట్లు కాస్తున్న ఎండలకు పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. కాగా బుధవారం కురిసిన వర్షానికి వరి ఉబాలకు ఊపిరి పోసినట్లు అయిందని రైతులు సంతోషపడుతున్నారు. కొత్తవలస మండల కేంద్రంలో గల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. భారీ వర్షం వచ్చిన ప్రతీసారి ఇదే పరిస్థితి దాపురిస్తోందని ఈ సమస్యలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జీవితాల్లో మార్పు తేవాలి



మాట్లాడుతున్న ప్రదీప్

గజపతినగరం : ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో నూతనంగా హెల్త్ బీమా పాలసీ తీసుకురావడం మంచి నిర్ణయమని, అయితే అందులో పని చేస్తున్న ఉద్యోగుల జీవితాల్లో మార్పు తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైద్యమిత్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రదీప్ కోరారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. ఈ పథకంలో పని చేస్తున్న వైద్యమిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, డీఈఓలు గత 16 సంవత్సరాలుగా పని చేస్తున్నా వారి జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగులను ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆప్కాస్ పరిధిలో ఉంచాలని కోరారు. నూతన బీమా పాలసీలోకి మార్చే ముందు ఉద్యోగ సంఘం నాయకులు, ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులతో కలిసి ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ముఖ్య కార్యదర్శిని కలిసి వినతి పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు.

గట్లపై కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం



కొవ్వాడపేటలో గట్లుపై బహుళ పంటల సాగును పరిశీలిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ హేమసుందర్

బొండపల్లి: వరి సాగు చేసే గట్లుపై కూరగాయలతో పాటు తక్కువ కాలంలో పండే పండ్లు చెట్లను నాటడం ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ హేమసుందర్ పేర్కొన్నారు. మండలంలోని కోవ్వాడపేట గ్రామంలోని వరి సాగు చేసే గట్లుపై ప్రకృతి వ్యవసాయం సాగు విధానంలో సాగు చేస్తున్న బహుళ పంటల కూరగాయల పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు అడుగులు గట్లు ఫీట్‌లుగా ఏర్పాటు చేసుకోని వాటిపై బహుళ పంటలను సాగు చేయడం వలన రైతులకు నిరంతరం అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. గట్లుపై జీవామృతం శాశ్వత ఫీట్‌లను ఏర్పాటు చేసుకోవడం వలన రైతులకు పెట్టుబడి తగ్గుతుందన్నారు. వరి పంటలో లైన్ షోయింగ్ విధానంలో నాట్లు వేసుకోవడం వలన అధిక దిగుబడులను పొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం స్వామినాయుడు, ప్రకృతి వ్యవసాయం మెంటర్ కాసులమ్మ, రైతు శాస్త్రవేత్త ఎం.కిషోర్, రైతులు పాల్గొన్నారు.


నేత్రదానంపై అవగాహన

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లోని విద్యార్థులకు నేత్రదానంపై బుధవారం అవగాహన కల్పించారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా నేత్రదానం చాలా గొప్పదన్నారు. మనం చేసే నేత్రదానం ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. మరణించిన ఆరు గంటల్లో నేత్రాలు దానం చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి ప్రభావతి జాగృతి ట్రస్టు, పొందూరు వారు బహుమతులు అందజేశారు.

అబ్బుర పరుస్తున్న కార్టూన్లు



దేశ భాషలందు తెలుగు భాష గొప్పదని తెలుపుతున్న కార్టూన్



తెలుగు భాష ప్రాబల్యాన్ని ఆంగ్లం తగ్గిస్తోందన్న అనే భావనతో గీసిన కార్టూన్


కొత్తవలస: వ్యావహారిక భాషోద్యమ నాయకుడు గిడుగురామ్మూర్తి పంతులు జయంతిని (ఆగస్టు29) పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్న సందర్భంగా మండలంలోని కంటకాపల్లి గేటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రేమ రామచంద్రరావు గీసిన పలు కార్టూన్లు అబ్బుర పరుస్తున్నాయి. అలాగే గత ఏడాది తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా తానా వారు నిర్వహించిన పోటీల్లో రామచంద్రరావు గీసిన కార్టూన్ ప్రథమ బహుమతి సాధించడం విశేషం. ప్రస్తుతం తెలుగు భాషకు పట్టిన గతిని, ఆంగ్లభాషకు గల ఆధిపత్యాన్ని చూపించేలా ఆయన గీసిన పలు కార్టూన్‌లు ఆకర్షిస్తున్నాయి.



గత ఏడాది తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఉత్తమ బహుమతి గెల్చుకున్న కార్టూన్



గత ఏడాది ఉత్తమ కార్టూన్‌కు సంబంధించిన బహుమతిని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి దుర్గాప్రసాద్, తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదగా బహుమతి అందుకుంటున్న రామచంద్రరావు



ఇంగ్లీష్ ఆధిపత్యం పెరుగుతోందన్న భావంతో గీసిన కార్టూన్